పోలండ్ వేదికగా ముగిసిన ఒల్లిన్ పోలిష్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత పురుషుల ద్వయం ఎం.ఆర్.అర్జున్,ధ్రువ్ కపిల్‌లు విజేతలుగా నిలిచారు.

కొలిన్స్ ఒబుయా రిటైర్మెంట్

23 ఏండ్ల కెరీర్‌కు వీడ్కోలు

నైరోబి :కెన్యా దిగ్గజ ఆల్‌రౌండర్ కొలిన్స్ ఒబుయా అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 42 ఏండ్ల కొలిన్స్.. ఐసీసీ నిర్వహిస్తున్న ఆఫ్రికన్ గేమ్స్‌లో భాగంగా ఉగాండాతో చివరి మ్యాచ్ ఆడాడు. 2001లో అరంగేట్రం చేసిన ఒబుయా.. తన కెరీర్‌లో 3 వన్డే వరల్డ్ కప్‌లు, ఒక టీ20 ప్రపంచకప్ ఆడాడు. 2003 వన్డే వరల్డ్ కప్‌లో కెన్యా సెమీస్ చేరడంలో ఒబుయా కీలకపాత్ర పోషించాడు. 2011 వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఒబుయా చేసిన 98 రన్స్ అతడి కెరీర్‌లో బెస్ట్ ఇన్నింగ్స్. వన్డేలలో 2,044 పరుగులు చేసిన అతడు టీ20లలో 1,668 రన్స్ చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో ఒబుయా ఖాతాలో 60 వికెట్లు ఉన్నాయి.

సెమీస్‌లోనే ముగిసిన శ్రీకాంత్ పోరాటం

బాసెల్ : స్విస్ ఓపెన్ సూపర్ 300 టోర్నీలో భారత పోరాటం ముగిసింది. సుమారు 16 నెలల (2022 నవంబర్ నుంచి) తర్వాత ఒక బీడబ్ల్యూఎఫ్ సూపర్ టోర్నీలో సెమీస్‌కు చేరిన కిడాంబి శ్రీకాంత్.. ఫైనల్‌కు ముందే చేతులెత్తేశాడు. శనివారం ముగిసిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో శ్రీకాంత్.. 21-15, 9-21, 18-21 తేడాతో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో పరాభవం పాలయ్యాడు. తొలి గేమ్‌లో దూకుడైన షాట్లతో ప్రత్యర్థిపై విరుచుకుపడిన శ్రీకాంత్.. రెండో గేమ్‌లో లయ తప్పాడు. చివరి గేమ్‌లో ఇరువురూ హోరాహోరీ పోరాడినా లిన్ చున్ నే విజయం వరించింది.

రాజస్థాన్ రాజసంగా..

మెరిసిన శాంసన్, పరాగ్

రాహుల్, పూరన్‌ల పోరాటం వృథా

లక్నోకు తప్పని ఓటమి

శాంసన్ (82*)

ఐపీఎల్ కొత్త సీజన్‌ను మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ విజయంతో ఆరంభించింది. బ్యాటింగ్‌లో కెప్టెన్ సంజూ శాంసన్, దేశవాళీలో నిలకడగా ఆడుతున్న అస్సాం కుర్రాడు రియాన్ పరాగ్‌లు రెచ్చిపోయి ఆడగా బౌలింగ్‌లో ట్రెంట్ బౌల్ట్‌తో పాటు ఇతర బౌలర్లూ సమిష్టిగా రాణించడంతో ఆ జట్టు లక్నోపై జయకేతనం ఎగురవేసింది. భారీ ఛేదనలో భాగంగా ఆదిలోనే తడబడ్డ లక్నో సూపర్ జెయింట్స్‌కు.. కేఎల్ రాహుల్, నికోలస్ పూరన్‌లు పోరాడినా పరాభవం తప్పలేదు.

జైపూర్ : ఐపీఎల్ - 17వ సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ రాజసంగా మొదలెట్టింది. జైపూర్‌లోని సవాయి మాన్‌సింగ్ స్టేడియం వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను 20 పరుగుల తేడాతో ఓడించి గెలుపు బోణీ కొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేయగా లక్ష్య ఛేదనలో లక్నో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగుల వద్దే ఆగిపోయింది. ఐపీఎల్ - 2020వ సీజన్ నుంచీ ఆడుతున్న ప్రతి తొలి మ్యాచ్‌లో ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు చేస్తున్న రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్ (52 బంతుల్లో 82 నాటౌట్, 3 ఫోర్లు, 6 సిక్సర్లు) లక్నోతోనూ ఆ సంప్రదాయాన్ని కొనసాగించాడు. రియాన్ పరాగ్ (29 బంతుల్లో 43, 1 ఫోర్, 3 సిక్సర్లు) అండతో రాజస్థాన్ భారీ స్కోరు సాధించేందుకు బాటలు పరిచాడు. భారీ ఛేదనలో లక్నోకు ట్రెంట్ బౌల్ట్ (2/35), సఫారీ సంచలనం నంద్రె బర్గర్ (1/30) ఆరంభంలోనే షాకులిచ్చినా రాహుల్ (44 బంతుల్లో 58, 4 ఫోర్లు, 2 సిక్సర్లు), నికోలస్ పూరన్ (41 బంతుల్లో 64 నాటౌట్, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆదుకున్నా ఆఖర్లో వేగంగా పరుగులు రాబట్టలేక ఆ జట్టు ఓటమి వైపున నిలిచింది.రాజస్థాన్ సారథి శాంసన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

దంచిన శాంసన్, పరాగ్:

రాజస్తాన్ ఇన్నింగ్స్‌లో శాంసన్-పరాగ్ ఆటే హైలైట్. నవీన్ ఉల్ హక్ వేసిన రెండో ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన బట్లర్ (11) అదే ఓవర్లో ఆఖరి బంతికి కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో రాజస్థాన్‌కు తొలి షాక్ తాకింది. వన్ డౌన్‌లో క్రీజులోకి వచ్చిన శాంసన్.. ఆది నుంచే దూకుడుగా ఆడాడు. మోహ్సిన్ ఖాన్ వేసిన ఐదో ఓవర్లో4,6 తో తన ఉద్దేశాన్ని చాటాడు. కానీ ఇదే ఓవర్లో ఐదో బాల్‌ను భారీ సిక్సర్‌గా మలిచిన జైస్వాల్ (24) మరుసటి బంతికే మిడాన్ వద్ద కృనాల్ పాండ్యాకు చిక్కడంతో రాజస్థాన్ రెండో వికెట్ కోల్పోయింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన పరాగ్‌తో కలిసి శాంసన్ రాజస్థాన్ స్కోరు బోర్డును ఉరకలెత్తించాడు. ఈ ద్వయం లక్నో బౌలర్లపై ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడింది. మూడో వికెట్‌కు 59 బంతుల్లోనే 93 పరుగులు జోడించిన ఈ జోడీకి ఎట్టకేలకు నవీన్ ఉల్ హక్ చెక్ పెట్టాడు. నాలుగో స్థానంలో వచ్చిన షిమ్రన్ హెట్‌మయర్ (5)ను బిష్ణోయ్ పెవిలియన్‌కు పంపినా ధ్రువ్ జురెల్ (20*).. కెప్టెన్‌తో కలిసి రాజస్తాన్‌కు భారీ స్కోరు చేయడంలో తోడ్పాటు అందించాడు.

ఆరంభం నుంచే తడబాటు:

లక్ష్య ఛేదనలో లక్నోకు తొలి ఓవర్ నుంచే కష్టాలు మొదలయ్యాయి. ట్రెంట్ బౌల్ట్.. మొదటి ఓవర్లోనే క్వింటన డికాక్ (4)ను ఔట్ చేశాడు. రెండో ఓవర్లో దేవ్‌దత్ పడిక్కల్ బౌల్డ్ అయ్యాడు. బర్గర్.. నాలుగో ఓవర్లో అయూష్ బదోనిని పెవిలియన్‌కు పంపాడు. 11 పరుగులకే లక్నో మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆరంభంలోనే తడబాటుకు లోనైన లక్నోను రాహుల్ ఆదుకున్నాడు. దీపక్ హుడా (26)తో కలిసి లక్నో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఈ ఇద్దరూ 26 బంతుల్లోనే 49 పరగులు జతచేశారు. కుదురుకుంటున్న లక్నో ఇన్నింగ్స్‌ను చాహల్ దెబ్బకొట్టాడు. పూరన్‌తో కలిసి రాహుల్ లక్నోలో గెలుపు ఆశలు రేపాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 85 పరుగులు జోడించారు. కానీ ఆఖర్లో రాహుల్, మార్కస్ స్టోయినిస్ (3) వికెట్లను కోల్పోవడంతో పాటు రాజస్థాన్ బౌలర్లు కట్టడి చేయడంతో లక్నోకు పరాభవం తప్పలేదు.

సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 193/4 (శాంసన్ 82 నాటౌట్, పరాగ్ 43, జైస్వాల్ 24, నవీన్ 2/41)
లక్నో: 20 ఓవర్లలో 173/6 (పూరన్ 64, రాహుల్ 58, ట్రెంట్ బౌల్ట్ 2/35, సందీప్ శర్మ 1/22)

గుజరాత్ గర్జన

రోహిత్, బ్రెవిస్‌ల పోరాడినా దక్కని విజయం

హార్దిక్‌కు తొలి మ్యాచ్‌లోనే భంగపాటు

లోస్కోరింగ్ గేమ్‌లో ఒత్తిడికి చిత్తైన ముంబై

నయా సీజన్‌లో నయా కెప్టెన్‌తో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో ఒత్తిడికి చిత్తైంది. పేసు గుర్రం జస్‌ప్రిత్ బుమ్రా, సఫాలీ సంచలనం గెరాల్డ్ కొయెట్జీలు తమ బౌలింగ్‌తో గుజరాత్ టైటాన్స్‌కు చుక్కలు చూపించగా.. మోస్తారు ఛేదనలో సఫాలీ కుర్రాడు డెవాల్డ్ బ్రెవిస్, తాజా, మాజీ సారథి రోహిత్ శర్మలు ధాటిగా ఆడినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. ఆఖర్లో వెంటవెంటనే నాలుగు వికెట్లు కోల్పోయిన ముంబై.. విజయానికి ఏడు పరుగుల దూరంలో ఆగిపోయింది. గిల్ సారథ్యంలో మూడో సీజన్ ఆరంభించిన గుజరాత్.. తొలి మ్యాచ్‌లోనే ఆకట్టుకుంది.

అహ్మదాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడుతున్న మూడో సీజన్‌లో రెండు సార్లు ఫైనల్ చేరిన గుజరాత్ టైటాన్స్.. సమిష్టి తత్వానికి మరోసారి అసలు సిసలైన నిర్వచనం ఇచ్చింది. ఈ లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా పేరున్న ముంబై ఇండియన్స్ ముందు మోస్తారు లక్ష్యాన్ని నిలిపినా ఆ జట్టు.. దానిని కాపాడుకోగలిగింది.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా ముగిసిన మ్యాచ్‌లో గుజరాత్.. 6 పరుగుల తేడాతో ముంబైపై పైచేయి సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (39 బంతుల్లో 45, 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (22 బంతుల్లో 31, 3 ఫోర్లు, 1 సిక్స్)లు రాణించారు. ముంబై స్టార్ పేసర్ బుమ్రా బంతితో నిప్పులు చెరిగాడు. 4 ఓవర్లు వేసిన బుమ్రా 14 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టగా దక్షిణాఫ్రికా బౌలర్ కొయెట్జీ (2/27) ముంబై తరపున తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. అనంతరం ఛేదనలో డెవాల్డ్ బ్రెవిస్ (38 బంతుల్లో 46, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), రోహిత్ శర్మ (29 బంతుల్లో 43, 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా ఆఖర్లో ఒత్తిడికి చిత్తైన ముంబై ఓటమి వైపు నిలిచింది. ఆరంభంలో తేలిపోయిన గుజరాత్ బౌలర్లు.. ఆఖర్లో మాత్రం ఆకట్టుకున్నారు. సాయి సుదర్శన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

బుమ్రా మ్యాజిక్..

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా (19), శుభ్‌మన్ గిల్ లు తొలి వికెట్‌కు 4 ఓవర్లలోనే 31 పరుగులు జోడించారు. కానీ బుమ్రా రాకతో గుజరాత్‌కు కష్టాలు మొదలయ్యాయి. అతడు వేసిన నాలుగో ఓవర్ చివరి బంతికి సాహా క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మూడు బౌండరీలు, ఒక సిక్సర్‌తో దూకుడుగా ఆడిన గిల్‌ను చావ్లా.. గూగ్లీతో బోల్తా కొట్టించాడు. అజ్మతుల్లా ఒమర్‌జయ్ (17) ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. సాయి సుదర్శన్‌తో కలిసి మూడో వికెట్‌కు 26 బంతుల్లోనే 40 పరుగులు జోడించిన అజ్మతుల్లాను కొయెట్జీ ఔట్ చేశాడు. గుజరాత్‌ను ఆదుకున్న సుదర్శన్‌తో పాటు ప్రమాదకర డేవిడ్ మిల్లర్ (12)ను బుమ్రా ఒక్క ఓవర్లోనే ఔట్ చేయడంతో ఆ జట్టు భారీ స్కోరు చేయడంలో తడబడింది. రాహుల్ తెవాటియా (15 బంతుల్లో 22, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆఖర్లో ధాటిగా ఆడి టైటాన్స్‌కు పోరాడగలిగే స్కోరును అందించాడు.

ముంబై బాదుడు..

మోస్తారు ఛేదనలో ముంబైకి మొదటి ఓవర్లోనే ఎదురుదెబ్బ తగిలింది. నాలుగు నెలల విరామం తర్వాత ప్రొఫెషనల్ క్రికెట్ ఆడుతున్న ఇషాన్ కిషన్.. డకౌట్ అయ్యాడు. వన్ డౌన్‌లో వచ్చిన నమన్ ధీర్ (10 బంతుల్లో 20, 3 ఫోర్లు, 1 సిక్సర్) ఉన్నది కొద్దిసేపే అయినా దూకుడుగా ఆడాడు. అజ్మతుల్లా వేసిన మూడో ఓవర్లో అతడు వికెట్ల ముందు దొరికిపోయాడు. 30 పరుగులుకే రెండు వికెట్లు కోల్పోయిన ముంబైని లూక్ వుడ్ ప్లేస్‌లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సఫారీ యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్‌తో కలిసి మాజీ సారథి రోహిత్ శర్మ ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ అదును చిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించారు. 55 బంతుల్లో 77 పరుగులు జతచేసిన ఈ జోడీని సాయికిషోర్ విడదీశాడు. అతడు వేసిన 13వ ఓవర్లో మొదటి బంతికే రోహిత్ వికెట్ల ముందు దొరికిపోయాడు. అర్ధ సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో ఉండగా బ్రెవిస్.. మోహిత్ శర్మ బౌలింగ్‌లో అతడికే క్యాచ్ ఇచ్చాడు.

ఆఖర్లో ఉత్కంఠ..

గెలుపు దిశగా వెళ్తున్న ముంబై రోహిత్, బ్రెవిస్‌లు ఔట్ అవడంతో డీలా పడింది. 17వ ఓవర్లో రషీద్ 3 పరుగులే ఇవ్వగా 18వ ఓవర్లో మోహిత్ శర్మ తన అనుభవన్నంతా రంగరించి బౌలింగ్ చేశాడు. ఈ ఓవర్లో 9 పరుగులే రాగా డేంజరస్ బ్యాటర్ టిమ్ డేవిడ్ (11) కూడా ఔట్ అయ్యాడు. 19వ ఓవర్ వేసిన స్పెన్సర్ జాన్సన్ బౌలింగ్‌లో మొదటి బంతికే భారీ సిక్సర్ కొట్టిన తిలక్ వర్మ మరుసటి బంతికే భారీ షాట్ ఆడబోయి అభినవ్ మనోహర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఐదో బంతికి కొయెట్జీ.. జాన్సన్‌కే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఆఖరి ఓవర్లో ముంబైకి 19 పరుగులు అవసరమయ్యాయి. ఉమేశ్ యాదవ్ వేసిన చివరి ఓవర్లో తొలి రెండు బంతులను 6, 4 గా మలిచిన పాండ్యా మూడో బంతికి ఔట్ అయ్యాడు. ఇదే క్రమంలో చావ్లా డకౌట్ అయ్యాడు. చివరి ఓవర్లో ఉమేశ్ 12 పరుగులే ఇచ్చి గుజరాత్‌కు ఉత్కంఠ విజయాన్ని అందించాడు.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్ : 20 ఓవర్లలో 168/6 (సాయి సుదర్శన్ 45, గిల్ 31, బుమ్రా 3/14, కొయెట్జి 2/27) **ముంబై :** 20 ఓవర్లలో 162/9 (రోహిత్ శర్మ 43, బ్రెవిస్ 46, జాన్సన్ 2/25, మోహిత్ శర్మ 2/32)

చిత్రం



చిత్రీకరణ ముగింపుదశకు గేమ్‌చేంజర్

ఏళ్ల తరబడి చిత్రీకరణ జరుపుకుంటున్న 'గేమ్‌చేంజర్' సినిమా షూటింగ్ ముగింపుదశకు చేరుకున్నట్టు తెలుస్తున్నది. రీసెంట్‌గా వైజాగ్‌లో కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసిన దర్శకుడు శంకర్, హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌కి తెరలేపారు. హైదరాబాద్ ఏఎఫ్‌ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ షెడ్యూల్‌లోని కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు శంకర్. ప్రధానతారాగణం ఈ షెడ్యూల్‌లో పాల్గొననున్నారట. మే వరకూ జరిగే ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుందని యూనిట్‌వర్గాల సమాచారం. ఈ సినిమా విడుదల తేదీని కూడా మే నెలలోనే నిర్మాత దిల్‌రాజు ప్రకటించనున్నారట. పోస్ట్‌ప్రొడక్షన్‌కు శంకర్ ఎక్కువ సమయం తీసుకుంటారన్న విషయం తెలిసిందే. జనవరిలో చిరంజీవి 'విశ్వంభర' విడుదల తేదీ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో 'గేమ్‌చేంజర్' డిసెంబర్లో విడుదల కావొచ్చనేది ఫిల్మ్‌వర్గాల టాక్. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో అంజలి, శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

అదికూడా తప్పంటే ఎలా?

ఆదాశర్మ ఎంత మంచి నటో 'ది కేరళ స్టోరీ' చూస్తే అర్థమవుతుంది. తెలుగులో ఆమె స్థాయి తగ్గ పాత్రలు ఆమెకు రాలేదనే చెప్పాలి. కేరక్టర్‌కోసం ఎంతటి సాహసానికైనా వెనుకాడని నటి ఆదాశర్మ. ఆమె నటించిన 'బస్తర్' చిత్రం ఈ నెల 15న విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. అయితే.. ఆ ఆనందం మాత్రం ఆమెకు లేదట. కారణం కొందరు నెటిజన్స్. ఈ సినిమా ఒప్పుకున్న దగ్గర్నుంచీ ఆమెపై ట్రోలింగ్ మొదలైందట. వ్యక్తిగత సాంఘిక మాధ్యమంలో ఆమె ఏ పోస్ట్ పెట్టుకున్నా కామెట్స్ మాత్రం 'బస్తర్' చిత్రాన్ని ఉద్దేశించే ఉంటున్నాయని అసహనం వ్యక్తం చేసింది ఆదాశర్మ. 'కథల ఎంపిక పూర్తిగా నా వ్యక్తిగతం. నాకు నచ్చిన కథ అంగీకరిస్తా. అదికూడా తప్పంటే ఎలా? 'ది కేరళ స్టోరీ' టైమ్‌లో కూడా ఇలాగే మాట్లాడారు. అసభ్యంగా పోస్టులు పెట్టారు. చాలా బాధేసింది. స్వతంత్ర్యభారతదేశంలో నచ్చిన కథలతో సినిమా తీసుకునే హక్కు మాకు లేదా? అసలు ఈ సినిమాలో నేను నటిస్తున్నానని అధికారిక ప్రకటన రాకముందే నాపై ట్రోల్స్ మొదలయ్యాయి. సినిమా విడుదలయ్యాక ట్రోల్స్ ఎక్కువైపోయాయి. నేను పువ్వుల ఫొటో పెట్టినా దానికి ఇబ్బందికరమైన కామెంట్స్ చేస్తున్నారు. కొందరైతే ఒకడుగు ముందుకేసి 'వేశ్య' లాంటి పదాలు కూడా వాడుతున్నారు. చాలా బాధగా ఉంది.' అంటూ వాపోయింది ఆ దాశర్మ. అసలు 'బస్తర్'లో ఏముంది? అనే విషయానికొస్తే.. ఇది నక్సల్ నేపథ్యంలో సాగే సినిమా. 'ది నక్సల్ స్టోరి' అనేది ఉపశీర్షిక. సమాజంలోని పలు వివాదాస్పద

ప్రతిరోజూ ఆ ఎగ్జైట్మెంట్ ఎక్స్‌పీరియన్స్ చేశాం

'కంగువ' నా కెరీర్‌లోని గొప్ప సినిమాల్లో ఒకటి. ఈ సినిమాలో నటించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు తమిళ అగ్రహీరో సూర్య. ప్రతిష్టాత్మకంగా ఆయన నటించిన 'కంగువ' మూవీ త్వరలో విడుదల కానుంది. భారీ పిరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ తెరకెక్కించిన ఈ చిత్రంలో దిశాపటానీ, బాబీ డియోల్ కీలక పాత్రధారులు. స్టూడియోగ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. పదిభాషల్లో విడుదల కానున్న ఈ పాన్‌ఇండియా చిత్రాన్ని త్రీడీలోనూ విడుదల చేయనున్నారు. తాజాగా ముంబైలో ఈ చిత్రం గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్ జరిగింది. సూర్యతోపాటు చిత్రబృందం కూడా పాల్గొన్నారు. సూర్య మాట్లాడుతూ 'పాతికేళ్ల అనుభవం తర్వాత ఒక సినిమాకు ఎగ్జైట్ అయి వర్క్ చేయడం సులువుకాదు. 'కంగువ'కు 150రోజులకు పైగా చేసిన షూట్‌లో ప్రతిరోజూ ఆ ఎగ్జైట్‌మెంట్ ఎక్స్‌పీరియన్స్ చేశాం.మన కోరికను యూనివర్స్ విని అది జరిగేలా చేస్తుందని నమ్ముతాను. అదే 'కంగువ'. ఇలాంటి ప్రాజెక్ట్ చేయాలని కలలుగన్న నిర్మాతలకూ, గొప్ప కథ రాసిన దర్శకుడుకీ, అద్భుతమైన సినిమాటోగ్రఫీ అందించిన వెట్రికీ, గుర్తుండిపోయే సంగీతాన్నిచ్చిన దేవిశ్రీకీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని చెప్పారు.

వెన్నులో వణుకు పుట్టించే లవ్‌మీ

ఓ కుర్రాడు దెయ్యాన్ని ప్రేమించాలనుకుంటే ఎలా ఉంటుంది? ఏమవుతుంది? అనే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న చిత్రం 'లవ్‌మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. ఆశిష్, వైష్ణవిచైతన్య జంటగా నటించారు. అరుణ్ భీమవరపు దర్శకుడు. హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగమల్లిడి నిర్మాతలు. 'కట్టిపడేసే కథనం, వెన్నులో వణుకుపుట్టించే హారర్ ఎలిమెంట్స్ ఈ చిత్రానికి ప్రధానబలాలు. ప్రేక్షకులకు మరిచిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది' అని దర్శకుడు చెబుతున్నారు. ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: పి.సి.శ్రీరామ్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

నా నల్ల కలువ పువ్వా..

చైతన్యరావు, అర్జున్ అంబటి
రులుగా రూపొందుతోన్న చిత్రం
నీరుకంటి మంజులా రాఘవేం
కున్న ఈ చిత్రం ఏప్రిల్ 12న వి
ప్రమోషన్స్‌లో భాగంగా పి.ఆర్
దాస్ రాసి, పాడిన 'నా నల్లా క
బృందం విడుదల చేశారు. దుర
మైన అమ్మాయిలు ఎలా బలైపో
కుటుంబం పడుతున్న బాధలు, రి
పాటలో మనసు కదిలించేలా చ
గిందని, దర్శకుడు సతీష్ అద్భు
కథతో ఈ సినిమాను మలిచాడ
పుట్ చాలా బాగా వచ్చిందని ని
తెలిపారు. ప్రేక్షకులకు నచ్చే మం
ర్షియల్ సినిమా ఇదని దర్శకుడు
చెప్పారు. ఈ చిత్రానికి మాటలు
శ్రావణ్, కెమెరా: శేఖర్ పోచంప

తండ్రుల సోషియో ఫోబియో నేపథ్యంలో..

' ప్రస్తుతం చాలామంది తండ్రులు సోషియో ఫోబియోతో ఉన్నారు. పిల్లల అభిప్రాయాలను అర్థం చేసుకోకుండా, నా కొడుకు ఇలా ఉండాలి.. అలా చేయాలి అని ఊహల్లో బతికేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగే కథాంశంతో రూపొందిన చిత్రం మా 'కలియుగపట్టణంలో' అన్నారు దర్శకుడు రమాకాంత్ రెడ్డి. విశ్వకార్తికేయ, ఆయూషి పటేల్ జంటగా నటించిన ఈ చిత్రానికి డాక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ నిర్మాతలు. ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం దర్శకుడు రమాకాంత్‌రెడ్డి విలేకరులతో ముచ్చటించారు. కలియుగంలో మనుషుల పోకడలు ఎలా ఉంటున్నాయో చూపించే ప్రయత్నం ఈ సినిమా అని, ఈ కథలో చక్కని సందేశంతోపాటు తల్లి సెంటిమెంటూ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయని దర్శకుడు చెప్పారు. ఇంకా చెబుతూ 'నా జీవితంలో నేను చూసిన సంఘటనల ఆధారంగా ఈ కథ తయారుచేసుకున్నాను. ఇందులో మంచి సందేశం ఉంది. సినిమాను కొందరు సినీపెద్దలకు వేసి చూపించాం. అందరికీ నచ్చింది. కథ, కథనాలేకాదు.. సాంకేతికంగా కూడా సినిమా బావుందని మెచ్చుకున్నారు. అజయ్ అరసాద సంగీతం, చరణ్ మాధవనేని సినిమాటోగ్రఫీ, సినిమాను మరో స్థాయిలో నిలబెట్టాయి. అన్నపూర్ణ స్టూడియోస్ లాంటి గొప్ప సంస్థ మా సినిమాను విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు దర్శకుడు రమాకాంత్‌రెడ్డి.

చంపుతుంది దెయ్యమేనా?

తీన్ కాడు అనే ప్రాంతంలోని అడవిలో వరుస హత్యలు జరుగుతుంటాయి. ఆ ప్రాంతంలో తిరిగే రాట్చి అనే దెయ్యమే ఈ హత్యలకు కారణమని అక్కడి ప్రజలు చెబుతుంటారు. సీబీసీఐడీకి ప్రభుత్వం కేసు అప్పగిస్తుంది. ఈ హత్యలకు కారణాలు తెలుసుకునేందుకు ఆ ఊరికి కొత్త ఇన్‌స్పెక్టర్ రిషి వస్తాడు. ఊరుజనం మాటలు నమ్మని రిషి, సైంటిఫిక్‌గా ఇన్వెస్టిగేషన్ చేస్తుంటాడు. ఈ క్రమంలో రిషికి, అతని టీమ్‌కీ షాక్ అయ్యే విషయాలు తెలుస్తుంటాయి. ఈ హత్యలకు కారణం దెయ్యమే అయితే, పరిష్కారం పోలీసులు ఎలా కనుక్కున్నారు? అనే ప్రశ్నకు సమధానంగా రూపొందుతోన్న హారర్ క్రైమ్ వెబ్‌సిరీస్ 'ఇన్‌స్పెక్టర్ రిషి'. నవీన్‌చంద్ర లీడ్ రోల్ చేస్తున్నారు. సునైన, కన్నా రవి, శ్రీకృష్ణ దయాళ్, మాలినీ జీవరత్నం, కుమార్ వేల్ కీలకపాత్రధారులు. నందిని జేఎస్ దర్శకత్వంలో సుఖ్‌దేవ్ లహరి నిర్మిస్తున్న ఈ వెబ్‌సిరీస్ అమెజాన్ తమిళ్ ఒరిజినల్‌లో ఈ నెల 29న స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నటి కాజల్ అగర్వాల్ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. తాను నటిస్తున్న 'సత్యభామ' సెట్‌లో ఈ వెబ్‌సిరీస్ ట్రైలర్ చూసిన కాజల్ వెబ్‌సిరీస్ బృందాన్ని అభినందించి, తన సోషల్‌మీడియాలో ఈ ట్రైలర్‌ని షేర్ చేసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.